క్లుప్తంగా

టీటీడీ ప్రచార రథం



టీటీడీ ప్రచార రథం వద్ద భజన చేస్తున్న భక్తులు

పాలకొండ: మండలంలోని సింగన్నవలస గ్రామానికి తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచార రథం ఆదివారం చేరుకుంది. వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొనేందుకు సింగన్నవలస మీదుగా సీతంపేట వెళ్తుండగా..భక్తులు దాన్ని చూసి తరించారు. పలువురు భక్తులు రథానికి పూజలు చేసి హారతిచ్చారు. భజన భక్తులు భజన గీతాలు ఆలపించారు.

భక్తిశ్రద్ధలతో ఉజ్జిడి బండి ఉత్సవం



ఉజ్జిడి బండికి పూజలు చేస్తున్న మహిళలు

వీరఘట్టం: వీరఘట్టం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగలో ప్రధాన ఘట్టం ఉజ్జిడి బండి ఉత్సవం. ఆదివారం ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి సేవకుడు బోయిడు ఇంటి వద్ద బయలుదేరిన ఉజ్జిడి బండికి బోయిడు మహేష్ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దండకం చదివిన తర్వాత ఈ బండిలో సద్దన్నం, ఉల్లిపాయను వేసి మొక్కుకున్నారు. అనంతరం అమ్మవారి సేవకులు ఉజ్జిడి బండిని పట్టణ వీధుల్లోకి మేళతాళలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. అన్ని వీధుల వాసులు ఈ ఉజ్జిడి బండిలో సద్దన్నం, ఉల్లిపాయలు వేశారు. అలాగే బండి చక్రాలకు ముర్రాటలతో మహిళలు పూజలు చేశారు. దీంతో వీరఘట్టం పట్టణంలో పండగ సందడి మొదలైంది.

పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించండి



ప్రభుత్వ పాఠశాలలో చేరిన చిన్నారులతో ఉపాధ్యాయులు

పాలకొండ: మండలంలోని ఓని గ్రామంలో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని వారి తల్లిదండ్రులను కోరారు. ప్రైవేటు పాఠశాలలు వద్దు.. ప్రభుత్వ పాఠశాలలే ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 11 మంది చిన్నారులను పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం బలగ నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండలానికి చేరుకున్న పాఠ్యపుస్తకాలు



పాఠ్యపుస్తకాలను ఎమ్మార్సీలో భద్రపరుస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్యపుస్తకాలను సిద్ధం చేశామని ఎంఈఓ నాగభూషణరావు తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలానికి 30 వేల పుస్తకాలు అవసరం కాగా, ఆదివారం నాడు 12077 పుస్తకాలు వచ్చాయన్నారు. మరో వారం రోజుల్లో మిగిలిన పుస్తకాలు కూడా వస్తాయన్నారు. వాటిని పాఠశాలలు ప్రారంభం నాటికి విద్యార్థులకు అందజేయనున్నట్లు చెప్పారు.

నేటి నుంచి రేగాలమ్మతల్లి ఉత్సవాలు



రేగాలమ్మతల్లి గుడి

గరుగుబిల్లి: మండలంలోని దళాయివలస గ్రామంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు రేగాలమ్మతల్లి గ్రామదేవత పండుగ మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మూడు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఘటాల ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ గులిపల్లి నారాయణమ్మ, ఎంపీటీసీ బొంగు గౌరమ్మ తెలిపారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తుల కోసం పార్వతీపురం నుంచి దళాయివలస వరకు ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరారు.

ప్రగతి పథంలో తెట్టంగి

- హామీలు గాలికొదిలేసిన గత ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు



రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామం నేడు ప్రగతి పథంలో నడుస్తోంది. పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో పాటు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ల సహకారంతో సర్పంచ్ అలజంగి విజయ, స్థానిక నాయకులు గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం గ్రామాభివృద్ధిని గాలికొదిలేస్తే.. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామం అభివృద్ధి చెందిందని గ్రామస్తులు అంటున్నారు.

హామీలను గాలికొదిలేసిన గత ప్రభుత్వం

టీడీపీ ప్రభుత్వ హయాంలో 2017 సెప్టెంబర్ 11న ముఖ్యమంత్రి హోదాలో తెట్టంగి గ్రామానికి వచ్చిన నారా చంద్రబాబునాయుడు ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. పక్కారోడ్లు, ఇంటింటికీ తాగునీటి కుళాయి, పశువైద్యశాల, పీహెచ్‌సీ నిర్మిస్తామని అన్నారు. కానీ వీటిలో ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. అనంతరం 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ పల్లెను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సహకారంతో తెట్టంగి గ్రామాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు సమకూరడంతో అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తెట్టంగి గ్రామంలో కోట్ల రూపాయలు నిధులు వెచ్చించి అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.40 లక్షలతో గ్రామసచివాలయాన్ని నిర్మించారు. మరో రూ.40 లక్షలతో ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాలను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఆ నిర్మాణాలు చివరిదశకు చేరుకున్నాయి. రూ.40 లక్షలతో సీసీరోడ్లు, రూ.15 లక్షలతో మురుగు కాలువల నిర్మాణం, రూ.6 లక్షలతో కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టారు.

గ్రామంలోని కొన్ని వీధుల్లో రూ.9.50 లక్షల వ్యయంతో జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. మిగిలిన వీధుల్లో కూడా త్వరలో పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. రూ.3.65 లక్షలతో ఆర్‌సీఎం చర్చ్ వీధి, సీబీఎం చర్చ్ వీధి, బంగారుతల్లి వీధితో పాటు శ్మశానవాటికల్లో బోర్లు ఏర్పాటు చేశారు. నాడు–నేడు కింద సుమారు కోటి రూపాయలతో పాఠశాలల అభివృద్ధి, అదనపు భవనాల నిర్మాణం చేపట్టారు. దీంతో పాటు గ్రామంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ఆర్థికంగా ఆదుకుంది.



శ్మశానవాటికకు వెళ్లేందుకు నిర్మించిన సీసీరోడ్డు



రూ.17.5 లక్షలతో నిర్మిస్తున్న వెల్‌నెస్ సెంటర్



రూ.22.5 లక్షలతో నిర్మిస్తున్న రైతుభరోసా కేంద్రం



నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన పాఠశాల

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే మా గ్రామం అభివృద్ధి చెందిందని గర్వంగా చెప్పుకోగలుగుతున్నాం. 2017 సెప్టెంబర్ 11న మా గ్రామానికి వచ్చిన అప్పటి సీఎం చంద్రబాబునాయుడు అనేక హామీలు ఇచ్చారు. కానీ వాటిని అమలు చేయలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రోడ్లు వేశాం. ఇంకా అనేక అభివృద్ధి పనులు చేశాం. **– పొట్నూరు లక్ష్మణరావు,** ఏఎంసీ వైస్ చైర్మన్, తెట్టంగి

పింఛన్ల కోసం యాతన పడ్డాం



టీడీపీ హయాంలో పింఛన్ కావాలంటే నానా యాతన పడాల్సి వచ్చేది. అర్హతా ఉన్నా..జన్మభూమి కమిటీలు మా అభ్యర్థనలను తోసిపుచ్చాయి. నేడు అర్హతే కొలమానంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. **– అలజంగి విజయ,** సర్పంచ్, తెట్టంగి

రూ.కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు



గ్రామాభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. నాడు–నేడుతో పాఠశాలల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం, కల్వర్టులు, మరుగు కాలువల నిర్మాణం చేపట్టింది. సచివాలయాలను నిర్మించి ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకువచ్చింది. **– సతివాడ చిన్నంనాయుడు,** మాజీ సర్పంచ్, తెట్టంగి

తూర్పుకాపుల సంక్షేమానికి కృషిచేస్తా..



ఎమ్మెల్సీను కలిసిన తూర్పుకాపు సామాజికవర్గ ప్రతినిధులు

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

పాలకొండ రూరల్: తూర్పుకాపుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఆదివారం తనను కలిసిన తూర్పుకాపు సామాజిక వర్గం ప్రతినిధులతో వారి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో తూర్పుకాపు సామాజిక భవన నిర్మాణానికి అవసరమైన స్థలం, నిధులు సమకూర్చటంలో సహకరించాలని వారు కోరారు. దీనిపై ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు. పాలకొండ, రాజాం, పాతపట్నం నియోజకవర్గాల్లో గల సామాజికవర్గ నాయకులు, పెద్దలతో చర్చించి అన్నివిధాల తమ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కిల్లారి నారాయణరావు, కాగాన వెంకటరమణ, లోలుగు వెంకటరాజశేఖర్, బొత్స సుదర్శన్, గంటి తిరుపతి, దువ్వ కృష్ణారావు, పాలవలస దవళేశ్వరరావు, కె.చౌదరినాయుడు, జగదీష్ తదితరులున్నారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకుని, వాటిని చేరుకునేందుకు ప్రణాళికతో ముందుకుసాగాలని అంపిలి సర్పంచ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు అన్నారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన పలువురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్, హెచ్ఎం ఎం.సోమేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కె.జనార్దనరావు, శశిరేఖ, కాంతారావు, ప్రభాకరరావు, అనీల్, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు. అంతకుముందు విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

సెలవుల్లో ఆన్‌లైన్ బోధన



ప్రోగ్రెస్ కార్డులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

సీతంపేట: వేసవి సెలవుల్లో విద్యార్థులకు ట్యాబ్‌ల సాయంతో ఆన్‌లైన్‌లో బోధించనున్నట్లు స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్ఎం ఎ.లిల్లీరాణి తెలిపారు. ఆదివారం విద్యార్థుల తల్లి దండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిపి 40 మంది చొప్పున గ్రూప్ క్రియేట్ చేసి దీనిలో వివిధ ప్రాజెక్టులు చేయడం ద్వారా డిజిటల్ ఎడ్యుకేషన్ అందించనున్నామన్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్‌ను వారి తల్లి దండ్రులకు వివరించారు. తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవో పాలక అమల తదితరులు పాల్గొన్నారు.

గిరిశిఖర గ్రామాల్లో తాగునీటి సరఫరా



నడింగూడలో ట్యాంక్ వద్ద నీరు పడుతున్న గిరిజన మహిళలు

భామిని: మండలంలోని తివ్వాకొండపై ఉన్న ఆదివాసీ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ట్యాంకుల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. ఆదివారం బొడ్డగూడ పంచాయతీ పరిధి కడంబసింగి, బంద్రసింగి, కోసిమానుగూడ, నడింగూడ, గేదెలగూడలకు ట్యాంక్‌ల ద్వారా తాగునీరు సరఫరా చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అమరాన సందీప్ తెలిపారు. నీటి సరఫరాను సర్పంచ్ బిడ్డిక మార్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు బిడ్డిక అనంతరావు పర్యవేక్షించారు. ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: సీతంపేట ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీఓ రంగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 8 ఖాళీలు ఉన్నాయి. మొగదారగూడ, ఆడలి అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఈతమానుగూడ, ఓండ్రుజోల, అడ్డాకులగూడ, మండ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు, గురండి, రాజుగాడిగూడలోని మినీ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్థానికంగా ఉంటున్న మహిళలు ఈనెల 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 15న దరఖాస్తుల పరిశీలన, 18న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి 19న ఐటీడీఏ పీఓ చేతులమీదుగా నియామక పత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు.

జియ్యమ్మవలస/కురుపాం: ఐసీడీఎస్ కురుపాం ప్రాజెక్ట్ పరిధిలోని కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ విజయగౌరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జియ్యమ్మవలస మండలంలోని చంద్రశేఖరరాజపురంలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు బీసీ–బి మహిళకు కేటాయించారు. సహాయకుల పోస్టులు.. వనజ (ఓసీ), వెంకటరాజపురం (ఓసీ), బిత్రపాడు (ఓసీ), పెదమేరంగి–2 (ఓసీ–ఈడబ్ల్యూఎస్), పందులవానివలస (ఓసీ) కేటగిరీకి చెందిన మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. కురుపాం మండలంలోని గుజ్జువాయి (ఎస్టీ నోటిఫైడ్), కురుపాం–5 (బీసీ–బి), పొద్దిశ (ఎస్టీ నోటిఫైడ్)లలో ఖాళీలున్నట్లు తెలిపారు. కార్యకర్త పోస్టుకు పదో తరగతి, సహాయక పోస్టులకు 7వ తరగతి పాసై, 21–35 సంవత్సరాల మధ్య వయసు, స్థానికంగా ఉంటున్న మహిళలు అర్హులుగా పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న మహిళలు 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కురుపాం ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

సర్పంచ్‌కు సన్మానం



సర్పంచ్ దంపతులను సన్మానిస్తున్న గడ్డికాలనీవాసులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషిచేసిన సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావును గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఆరోగ్యవంతమైన పంచాయతీ (థీమ్–2) అవార్డు పొందినందుకు స్థానిక గడ్డికాలనీ వాసులు సర్పంచ్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, వార్డు సభ్యులు జిన్నాన వెంకటరావు పాల్గొన్నారు.

ఘనంగా అసిరితల్లి ఉత్సవాలు



అమ్మవార్లుకు మొక్కులు చెల్లిస్తున్న మహిళలు

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మహిళలు అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు. గ్రామ పొలిమేరల్లో ఉన్న అమ్మవార్లుకు మొక్కులు చెల్లించారు. కోటదుర్గమ్మ, మరిడమ్మ దేవతలకు పూజలు చేశారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నాణ్యతలో రాజీ పడొద్దు: ఎమ్మెల్యే



రహదారి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ రూరల్: పాలకొండ–రాజాం రహదారిలో స్థానిక వైఎస్సార్ కూడలి నుంచి సంకిలి వంతెన వరకు నిర్మాణ దశలో ఉన్న రహదారి తాజా స్థితిగతులను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆదివారం పరిశీలించారు. పనుల నాణ్యతపై ఆరాతీశారు. రాకపోకలు సాగించేందుకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రూ.3 కోట్లుతో రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. నాణ్యతలో రాజీపడకుండా పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సకాలంలో పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఆదివాసీ జేఏసీ ఏర్పాటు



జేఏసీ నేతలతో గిరిజన నాయకులు

కురుపాం: ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ కురుపాం మండల కార్యవర్గం ఎన్నిక ఆదివారం కొండలేవిడిలో జరిగింది. కార్యవర్గం ఎన్నికకు ముఖ్య అతిథిగా ఏజేఏసీ గౌరవ చైర్మన్ నిమ్మక జయరాజు హాజరయ్యారు. జేఏసీ కార్యవర్గాన్ని అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గిరిజన సమస్యలపై ఐకమత్యంతో పోరాడి సాధించుకుందామని ప్రతిన బూనారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ ఇంటికుప్పల రామకృష్ణ, బిడ్డిక రామారావు, పల్ల సురేష్, దుక్క సీతారాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హిమరిక నీలకంఠం, వైస్ ఎంపీపీ అన్నాజీరావు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

పాలకొండ రూరల్: స్థానిక ఇందిరానగర్ కాలనీలో కొలువుతీరిన శ్రీమద్‌విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామివారి జీవసమాధి పూజలను భక్తులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ దశమి ఆదివారం నాడు స్వామి ఈ లోకమును వీడి జీవసమాధి అయినట్లు అర్చకులు రాంప్రసాద్ పాడీ తెలిపారు. కాలజ్ఞాన ప్రబోధనలతో లోకానికి మార్గదర్శకంగా నిలచిన వీరబ్రహ్మేంద్రుని విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన విశ్వబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని ప్రసాద వితరణ చేపట్టారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీటీసీ బాలకృష్ణ, తదితరులు

భామిని: మండలంలోని బిల్లుమడ కాలనీలో జీజీఎంపీ నిధులతో అభివృద్ధి పనులకు ఎంపీటీసీ బూస బాలకృష్ణ, మాజీ సర్పంచ్ సిగడాన రాజు ఆదివారం భూమిపూజ చేశారు. ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించిందన్నారు. ఆ నిధులతో సీసీ కాలువలు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు చెప్పారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



సొలికిరిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న రైతుసంఘ సభ్యులు

భామిని: మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..జిల్లాలో మొక్కజొన్న అధికంగా సాగు చేస్తున్నారని, ప్రభుత్వం పంటకొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారీలు, వ్యాపారులు చేతిలో మోసపోతున్నారని అన్నారు. మండలంలో సుమారు 1200 ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతుండగా.. 2700 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

భామిని: మండలం వడ్డంగిగూడలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పత్తిక రమేష్‌కు కుటుంబానికి వైఎస్సార్ బీమా మంజూరైంది. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు బోడెపు శ్రీనివాసరావు, సర్పంచ్ కొండగొర్రి ఉషారాణి మృతుడి తల్లి పత్తిక చిలకమ్మకు తక్షణ సాయంగా రూ.10వేలును ఆదివారం అందజేశారు.

మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం నామినీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందన్నారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వెల్ఫేర్ అసిస్టెంట్ గౌతమి, వీఆర్‌ఓ జె.మోహనదాస్ ఉన్నారు.